క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్: పట్టణంలోని సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. చెన్నూర్‌లోని 33/11కేవీ సబ్ స్టేషన్‌లో శనివారం మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.
లక్సెట్టిపేట: మండలంలోని పలు గ్రామాలకు ఈ నెల 3వ తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ గణేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ ఫీడర్స్ మరమ్మతు దృష్ట్యా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు మండలంలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

ఎయిమ్స్‌లో పసికందుకు శస్త్ర చికిత్స


చిన్నారితో వైద్యులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో 23రోజుల పసికందుకు శస్త్ర చికిత్స విజయవంతం చేసినట్లు ఆసుపత్రి వైద్యులు శ్రీనివాస్ యెగ్గన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెన్నెల మండలానికి చెందిన రవళి–రంజిత్ దంపతుల మగ శిశువు చేతికి ఇన్‌ఫెక్షన్ కావడంతో ఎయిమ్స్‌లో చేర్చారు. పేషెంట్‌కు సెప్టిమియా ఉండటంతో పిడియాట్రిక్స్ విభాగం డాక్టర్ సునీత, ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ టీమ్ సహకారంతో ఆపరేషన్ చేసి విజయవంతం చేసినట్లు వారు తెలిపారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు సంబంధించి ఆర్థోపెడిక్ విభాగంలో ఎన్నో శస్త్ర చికిత్సలు ఎయిమ్స్ ఆసుపత్రిలో అతి తక్కువ ఖర్చుతో చేశామని తెలిపారు.

డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగింపు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ అధ్యయన కేంద్రాల్లో ప్రవేశాల గడువును ఈ నెల 16వ తేదీ వరకు పొడిగించినట్లు అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీలో చేరేందుకు ఇంటర్, ఐటీఐ, తత్సమాన కోర్సులను పూర్తి చేసిన వారు అర్హులని, దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తా


రవీందర్

మంచిర్యాలక్రైం: మంచిర్యాల పట్టణ సీఐగా శ్రీపెరంబుదూర్ రవీందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటూ చట్టపరిధిలో నిస్వార్థంగా సేవలందిస్తానని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలున్నా నేరుగా నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలు, అక్రమరవాణ, మహిళల భద్రత, డ్రగ్స్ నివారణ, పేకాట, చోరీల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం పట్టణ ఎస్సైలు రాజేందర్, మహేందర్, జగదీష్, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సమష్టి కృషితో లక్ష్య సాధన


ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: సమష్టి కృషితోనే అనుకున్న లక్ష్యాలను సాధిస్తున్నామని ఆర్కే 7గ్రూప్ ఏజెంట్ రాముడు తెలిపారు. జనవరీ నెలలో 100శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన సందర్భంగా శుక్రవారం గనిపై అభినందన సమావేశం నిర్వహించారు. ఈ ఉత్పత్తి లక్ష్యాలకు కృషి చేసిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. రాబోయే రెండు నెలల్లో కూడా 100శాతం మించి రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ సాయి ప్రసాద్, గని రక్షణాధికారి రవిశంకర్, సంక్షేమ అధికారి సంతన్, అండర్ మేనేజర్లు రవీందర్, తేజ, ఇంజనీర్లు ప్రవీణ్, రమేశ్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు కొట్టె కిషన్‌రావు, పిట్ సెక్రెటరీ బేర రవీందర్, శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రత్యేక పాలన షురూ..!

పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో శుక్రవారం నుంచి పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. మంచిర్యాల జిల్లాలోని 16మండలాల్లో మొత్తం 311గ్రామ పంచాయతీలకు గాను 138మంది గెజిటెడ్ స్థాయి అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఒక్కో అధికారికి 1 నుంచి నాలుగు గ్రామ పంచాయతీల వరకు బాధ్యతలు అప్పగించారు. రెవెన్యూ శాఖ నుంచి తహసీల్దార్‌లు, నాయబ్ తహసీల్దార్లు, పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏఈలు, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ అధికారులు, వ్యవసాయ శాఖ ఏవోలు, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్‌లు, ఐసీడీఎస్ సీడీపీఓలు, విద్యా శాఖ ఎంఈఓలు, ఇరిగేషన్ ఏఈలు, అటవీ శాఖా అధికారులు, ఉద్యానవన శాఖ నుంచి అంతా గెజిటెడ్ అధికారులు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులుగా ఉన్నారు. కలెక్టర్ సంతోష్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో బాధ్యతలు తీసుకున్నారు.

హాజీపూర్‌లో వీరే..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని 17గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులుగా 9మంది గెజిటెడ్ స్థాయి అధికారులను నియమించారు. బుద్దిపల్లి, దొనబండ, పెద్దంపేట గ్రామాలకు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఈ.సరిత, ర్యాలీ, చిన్నగోపాల్‌పూర్‌లకు పంచాయతీ రాజ్ ఏఈ డి.కామేశ్వర్‌రెడ్డి, గఢ్‌పూర్, వేంపల్లి, గుడిపేటకు మండల పంచాయతీ అధికారి జి.శ్రీనివాస్, హాజీపూర్‌కు తహసీల్దార్ జి.సతీశ్‌కుమార్, కర్ణమామిడికి నాయబ్ తహసీల్దార్ జి.హరిత, ముల్కల్ల, నర్సింగాపూర్ గ్రామాలకు ఎంపీడీఓ అబ్దుల్‌హై, నాగారంకు పంచాయతీ రాజ్ ఏఈ డి.కామేశ్వర్‌రెడ్డి, నంనూర్, రాపల్లి గ్రామాలకు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి.శాంతిరేఖ, పడ్తనపల్లికి మిషన్ భగీరథ ఏఈ ఈ.గిరిజ, టీకానపల్లి గ్రామ ప్రత్యేక అధికారిగా వ్యవసాయ శాఖ ఏఓ మార్గం రజిత బాధ్యతలు స్వీకరించారు.


గుడిపేటలో బాధ్యతలు తీసుకుంటున్న ఎంపీవో

బెల్లంపల్లి మండలంలో...

బెల్లంపల్లిరూరల్: మండల పరిధిలో 17గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బుధాకుర్దు, చాకేపల్లి గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో డి.రాజేందర్ బాధ్యతలు చేపట్టారు. సోమగూడెం గ్రామ పంచాయతీకి తహసీల్దార్ సుధాకర్, ఆకెనపల్లి, పాతబెల్లంపల్లి గ్రామ పంచాయతీలకు ఎంపీవో శ్రీనివాస్, అంకుశం, కన్నాల గ్రామ పంచాయతీలకు డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, బట్వాన్‌పల్లి, దుగ్నెపల్లి, పెర్కపల్లి గ్రామ పంచాయతీలకు పంచాయతీరాజ్ ఏ.ఈ విష్ణుకుమార్, బుధాకలాన్, చంద్రవెల్లి గ్రామ పంచాయతీలకు హార్టికల్చర్ అధికారి సుప్రజ, బుచ్చయ్యపల్లి, లింగాపూర్ గ్రామ పంచాయతీలకు పశువైద్యశాఖ వైద్యురాలు సుజాత, గురిజాల, మాలగురిజాల, లంబాడితండా గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా మండల పశువైద్యాధికారి పావనిలను నియమించినట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు.


బాధ్యతలు చేపడుతున్న ఎంపీడీవో రాజేందర్

కాసిపేట మండలంలో...


దేవాపూర్‌లో ఎంపీడీవోను సన్మానిస్తూ...

కాసిపేట: దేవాపూర్, గట్రావుపల్లి గ్రామపంచాయతీ అధికారిగా ఎంపీడీవో ఎంఏ అలీం, చిన్నధర్మారం–తహసీల్దార్ భోజన్న, పెద్దనపల్లి గ్రామపంచాయతీ– డెప్యూటీ రేంజ్ అధికారి సుభాష్ బాధ్యతలు స్వీకరించారు.

భీమారం మండలంలో...

భీమారం: పోలంపల్లి, భీమారం గ్రామపంచాయతీలకు సతీష్ రెడ్డి(మండల పంచాయితీ అధికారి), ఆరెపల్లి, మద్దికల్ బత్తుల విశ్వంబర్(తహసీల్దార్), నర్సింగాపూర్, కాజిపల్లి, కె.శ్రీనివాస్ (ఎంపీడీవో), ఎలకేశ్వరం, కొత్తపల్లిలకు ఎల్.కృష్ణ (డిప్యూటీ తహసీల్దార్, బూర్గుపల్లికి రాకేశ్‌శర్మ(మండల పశువైద్యాధికారి), దాంపూర్, ధర్మారంలకు అఖిల్(ఇరిగేషన్ శాఖ ఏఈ)లకు పంచాయతీ ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

జన్నారం మండలంలో...

జన్నారం: మండలంలోని 19 గ్రామాలకు పది మంది ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారి చేశారు. జన్నారం, కామన్‌పల్లి, కిష్టాపూర్ (తహసీల్దార్ వేణుగోపాల్), చింతగూడ, దేవునిగూడ, కొత్తపేట(ఎంపీడీవో అరుణరాణి), బాదంపల్లి, చింతలపల్లి, లింగయ్యపల్లి (ఎంఈవో విజయ్‌కుమార్), మల్యాల, పొనకల్, లోతొర్రే (ఎంపీవో సింగిడి రమేశ్), బంగారు తాండ, హాస్టల్ తాండా, కవ్వాల్ (ఇరిగేషన్ ఏఈ రాజు), ధర్మారం, రేండ్లగూడ, ఇందన్‌పల్లి (మండల పశువైద్యాధికారి శ్రీకాంత్) ఇందన్‌పల్లి, మొర్రిగూడ, తొమ్మిది గుడిసెలపల్లి (పశువైద్యాధికారి రాజుకుమార్), కలమడుగు, మురిమడుగు, వెంకటపూర్(పీఆర్ జేఈ శీలం సతీశ్), రోటిగూడ, మహ్మదాబాద్, తపాలపూర్(డీటీ రామ్మోహన్), రాంపూర్, సింగరాయిపేట్, తిమ్మాపూర్(ఏవో పొనగంటి సంగీత)ను గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో అరుణరాణి తెలిపారు.

లక్సెట్టిపేటలో...


తిమ్మాపూర్‌లో ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి...

లక్సెట్టిపేట: మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం అయింది. తిమ్మాపూర్‌లో ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. మొత్తం పద్దెనిమిది గ్రామాల్లో ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు. ప్రజాప్రతినిధులు అధికారులకు శాలువాలతో సన్మానం చేశారు.

వేమనపల్లి మండలంలో...

వేమనపల్లి: వేమనపల్లి, నాగారాం గ్రామపంచాయతీలకు ఎంపీడీఓ లక్ష్మయ్య, నీల్వాయి, ముల్కలపేటలకు ఎంపీఓ బాపురావు, గొర్లపల్లి, రాజారాం, తహసీల్దార్ సదానందం, దస్నాపూర్, సూరారాం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్, సుంపుటం, క్లైంపల్లి డీటీ గోవిందసింగ్, కేతన్‌పల్లి, చామనపల్లి పశువైద్యాధికారి అరుణ, బుయ్యారం, జిల్లెడ ఏఓ వీరన్న బాధ్యతలు స్వీకరించారు.



చెన్నూర్ మండలంలో...

చెన్నూర్‌రూరల్: సర్పంచుల పదవికాలం ముగియడంతో మండలంలోని 30గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించగా వారు శుక్రవారం ఆయా పంచాయతీలలో బాధ్యతలు స్వీకరించారు. ప్రత్యేకాధికారులుగా ఆయాశాఖలకు చెందిన అధికారులను నియమించారు. తహసీల్దార్ మల్లిఖార్జున్, ఎంపీడీవో శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ చేతన్, పశువైద్యాధికారి శ్రీనివాస్, ఎంపీవో అజ్మత్ అలీ, ఏఈ పీఆర్ శివకుమార్, ఐసీడీఎస్ సీడీపీవో మనోరమ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సరితలను నియమించారు.

దండేపల్లి మండలంలో...

దండేపల్లి: దండేపల్లి, నెల్కివెంకటాపూర్, వందుర్‌గూడ పంచాయతీల ప్రత్యేకాధికారిగా వేముల మల్లేశం(ఎంపీడీవో), కొత్తమామిడిపల్లి, మామిడిపల్లి, మేదరిపేట జీపీల ప్రత్యేకాధికారిగా సంధ్యారాణి (తహసీల్దార్), కర్ణపేట, తానిమడుగు, నర్సాపూర్ జీపీలకు ఆకుల విజయ(డిప్యూటీ తహసీల్దార్), ధర్మరావ్‌పేట, ద్వారక, లక్ష్మీకాంతపూర్, పెద్దపేట జీపీలకు బి.శ్రీనివాస్(ఎంపీవో) చింతపల్లి, ముత్యంపేట, కొర్విచెల్మ జీపీలకు గొర్ల అంజిత్ కుమార్ (మండల వ్యవసాయాధికారి), అల్లీపూర్, గుడిరేవు, లింగాపూర్ జీపీలకు విక్రంరెడ్డి (పీఆర్ ఏఈ), గూడెం, కన్నెపల్లి, జీపీలకు అరుణ్‌కుమార్ (గ్రిడ్ ఏఈ), మాకులపేట, నాగసముద్రం, తాళ్లపేట, రాజుగూడ జీపీలకు శిరీష (ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ), నంబాల, రెబ్బనపల్లి, చెల్కగూడెం జీపీలకు ధన్‌రాజ్ (పశువైద్యాధికారి), కొండాపూర్, కాసిపేట, వెల్గనూర్ పంచాయతీలకు విజయబాస్కర్ (ఇరిగేషన్ ఏఈ)లను ప్రత్యేకాధికారులుగా నియమించడంతో, వారంతా బాధ్యతలు స్వీకరించారు.

తాండూర్ మండలంలో..


బాధ్యతలు చేపడుతున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

బెల్లంపల్లి: తాండూర్ మండలంలోని 15గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. అచ్చలాపూర్, గోపాల్‌నగర్ జీపీలకు ప్రత్యేక అధికారిగా తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, కిష్టంపేట, తాండూర్‌కు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, మాదారం, రాజీవ్‌నగర్‌కు డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కెడీ ప్రసాద్, కొత్తపల్లి, రేచినిలకు ఎంపీవో సత్యనారాయణ, బోయపల్లి, చౌటపల్లిలకు మండల వ్యవసాయాధికారి కిరణ్మయి, ద్వారకాపూర్, కాసిపేటలకు పంచాయతీ రాజ్ ఏ.ఈ కల్యాణ్ రెడ్డి, మాదారం–3 ఇంక్లైన్, నర్సాపూర్ జీపీలకు పశువైద్యాధికారి భూమయ్య, నీలాయపల్లి గ్రామ పంచాయతీకి పశువైద్యాధికారి నర్సింహారావులు ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులకు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కోటపల్లి మండలంలో...

కోటపల్లి: మండలంలోని 31 పంచాయతీలకు గాను ప్రత్యేకాధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాంపూర్, దేవులవాడ, కొల్లూర్ గ్రామపంచాయితీ ప్రత్యేకాధికారి ఏవో మహేందర్ బాధ్యతలు స్వీకరించి గ్రామంలో నెలకొన్న సమస్యలపై కా ర్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఏవో మహేందర్‌ను కార్యదర్శులు సన్మానించారు.


ప్రత్యేకాధికారిని సన్మానిస్తున్న కార్యదర్శి

మందమర్రి మండలంలో..

మందమర్రిరూరల్: మండలంలో 10 గ్రామ పంచాయతీలు ఉండగా ఎంపీడీవో శశికళను అందుగులపేట, తహసీల్దార్ చంద్రశేఖర్‌ను పులిమడుగు, ఎంపీవో భీరయ్యను వెంకటాపూర్, నాయబ్ తహసీల్దార్ సుమన్‌కుమార్‌ను బొక్కలగుట్ట, అసిస్టెంట్ ఇంజనీర్ (పీఆర్) రాజశేఖర్‌ను చిర్రకుంట, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఇరిగేషన్) సునీతను పొన్నారం, అసిస్టెంట్ ఇంజనీర్(ఇరిగేషన్, కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్) సీహెచ్ రమ్యను సారంగపల్లి, అగ్రికల్చర్ ఆఫీసర్ రాజేశంను శంకర్‌పల్లి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఎంఏ వసీమ్‌ను మామిడిగట్టు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (మిషన్ భగీరథ) మనోజ్‌కుమార్‌ను ఆదిల్‌పేట్ గ్రామ పంచాయతీకి కేటాయిస్తూ ఆదేశాలు వచ్చాయి. కాగా శుక్రవారం పలువురు బాధ్యతలు స్వీకరించారు.

పెద్దపల్లి ఎంపీ సీటు మాదిగలకు కేటాయించాలి

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ సీటును ప్రధాన రాజకీయ పార్టీలు ఈ సారి మాదిగ కులస్తులకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేశ్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై అసెంబ్లీలో కమిటీ వేసి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై పాలకులు స్పందించకుంటే ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని ప్రకటించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ బెల్లంపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షులు బరిగెల రఘు, కుశ్నపల్లి రాజలింగు, నాయకులు గోగర్ల శేఖర్, మోకెనపల్లి నారాయణ, బొంకూరి రాంచందర్, వెంకటేష్, కల్వల తిరుపతి, రాజలింగు, ప్రశాంత్, రాజేష్, శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ

జన్నారం: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి టాలెంట్ టెస్టులో జన్నారం మండలం కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎల్కుసి రఘు అనే పదో తరగతి విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు ఆయన జోనల్ స్థాయిలో బహుమతి అందుకున్నట్లు పాఠశాల హెచ్‌ఎం కట్ట రాజమౌళి తెలిపారు. విద్యార్థులను సబ్జెక్టు నాలెడ్జ్‌తో పాటుగా, పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచేలా ఉపాధ్యాయులు సిద్ధం చేస్తున్నారని, పదో తరగతి పరీక్షల్లో కూడా ఉత్తమ ఫలితాలు వచ్చేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచులకు సన్మానం



భీమారం/జన్నారం/చెన్నూర్‌రూరల్: చెన్నూర్‌రూరల్ మండలంలోని కిష్టంపేట మాజీ సర్పంచ్ బుర్ర రాకేష్‌గౌడ్‌ను, జన్నారం మండలం తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ జాడి గంగాధర్‌ను, భీమారం మాజీ సర్పంచ్ గద్దె రాంరెడ్డిని, పాలకవర్గ సిబ్బందిని శుక్రవారం ఆయా గ్రామాల ప్రజలు సత్కరించారు.

విద్యార్థులు రాణించాలి


నృత్యం చేస్తున్న విద్యార్థులు

నస్పూర్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈవో పోచయ్య అన్నారు. నాగార్జునా కాలనీలోని ప్రాణహిత స్టేడియంలో శుక్రవారం జరిగిన శ్రీ రెయిన్‌బో స్కూల్ పదో వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పాఠశాల విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఇంద్రవెల్లి సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

భీమారం/భీమిని/బెల్లంపల్లి/వేమనపల్లి/మందమర్రిరూరల్/చెన్నూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు శుక్రవారం జిల్లా నలుమూలల నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సారథ్యంలో బస్సుల్లో అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టుల భర్తీకి అర్హత, ఆసక్తి కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని బెల్లంపల్లి మండల విద్యాధికారి పి.మహేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్న ఆయా పోస్టులకు 18–45ఏళ్ల లోపు వయోపరిమితి కలిగి ఉండాలని తెలిపారు. హెడ్ కుక్ పదోతరగతి, అసిస్టెంట్ కుక్ ఏడో తరగతి చదివి ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తు దారులు స్థాని కులై ఉండాలని, ఇందు కోసం నివాస ధ్రువీకరణ పత్రం 7, 10తరగతుల మార్కుల మె మో, ఆధార్‌కార్డులను దరఖాస్తుతో జత చేసి అందజేయాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 5వ తేదీ సాయంత్రం 4గంటల వరకు మండల విద్యావనరుల కేంద్రంలో సమర్పించాలని ఆయన కోరారు.

స్కావెంజర్ పోస్టులకు...
జన్నారం: మండలంలోని కేజీబీవీలో స్కావెంజర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టు కోసం మండలానికి చెందిన వారే అర్హులన్నా రు. దరఖాస్తు చేసుకునే వారి వయస్సు 2023సెప్టెంబర్ 1వ తేదీ నాటికి 18సంవత్సరాలు నిండి 45సంవత్సరాల లోపు వారు అ యి ఉండాలన్నారు. నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డులతో కలిసి ఈ నెల 5 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
దండేపల్లి: దండేపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న స్కావెంజర్ పోస్టు భర్తీ కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంఈవో రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి పాసై, 18నుంచి 45ఏళ్ల మహిళలు, స్థానిక మండలానికి చెందిన వారై ఉండాలి. పూర్తి చేసిన దరఖాస్తులను స్థానిక మండల విద్యాధికారి కార్యాలయంలో ఈ నెల 6 లోగా అందజేయాలన్నారు.
బెల్లంపల్లి: తాండూర్ మండల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న స్వీపర్, స్కావెంజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో వాసాల ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయని, వీటికి మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానికులైన అభ్యర్థులు 18–45ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండి కనీసం ఏడో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఏడో తరగతి సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ పత్రం జత చేసి ఈ నెల 5వ తేదీ సాయంత్రం 4గంటల వరకు మండల విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తును అందజేయాలని కోరారు.

ఉచిత శిక్షణ కోర్సులకు...
మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సేవా సమితి ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆసక్తి గల వారు దరకాస్తు చేసుకోవాలని ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాం సుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణిలో భూనిర్వాసితులు, సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలు, సింగరేణి ఉద్యోగుల పిల్లలు, భార్యలకు, సింగరేణి పరివాహ ప్రాంత గ్రామాల నిరుద్యోగ యువతీ, యువకులకు అవకాశం ఉంటుందని, ఆసక్తి గల వారు ఈ నెల 7వరకు ఏరియాలోని పర్సనల్ డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో సంబంధిత వివరాల కోసం సంప్రదించాలని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

రూమ్ టూ రీడ్ ప్రోగ్రాం పరిశీలన
దండేపల్లి: రూమ్ టూ రీడ్(ఆర్‌టీఆర్) ప్రోగాం కార్యక్రమంలో భాగంగా దండేపల్లి మండలం ద్వారక ప్రాథమిక పాఠశాలను రూమ్ టూ రీడ్ ప్రోగ్రాం అధికారులు నితిన్ ఠాకూర్, మధు శుక్రవారం సందర్శించారు. విద్యార్థులతో తరగతి గదిలో పాఠాలు చదివించి, వారి ప్రతిభ సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గురువయ్య, సీఆర్పీ సురేందర్ పాల్గొన్నారు.

పదోన్నతి పత్రాల అందజేత
మందమర్రిరూరల్: ఏరియాలోని కేకే–5 గనిలో కొంత కాలంగా యాక్టింగ్ చేస్తున్న ఉద్యోగులకు జనరల్ మజ్దూర్స్‌తో పాటు ట్రామర్స్, కోల్ కట్టర్స్, టబ్ రిపేర్ మేస్త్రీ, హాలర్ ఆపరేటర్స్, మేషన్ మేస్త్రీతో యాజమాన్యం పదోన్నతులు కల్పించింది. కేకే–5 గనిపై శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదోన్నతులు పొందిన ఉద్యోగులకు గని మేనేజర్ భూశంకరయ్య పదోన్నతి పత్రాలు పంపిణీ చేశారు.

డంప్ యార్డు ఎత్తి వేయాలి
బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలో జన నివాసాలకు చేరువలో ఏర్పాటు చేసిన డంప్ యార్డును వెంటనే ఎత్తి వేసి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని మేము సైతం ఎడ్యుకేషన్, రూరల్ డెవలప్‌మెంట్ యూత్ వెల్ఫేర్ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త రంగ ప్రశాంత్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని జ్యోతిభాపూలే ప్రజాభవన్‌కు శుక్రవారం వెళ్లి ప్రత్యేక అధికారికి డంప్‌యార్డు ఎత్తి వేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ
వేమనపల్లి: నస్పూర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నీల్వాయి జెడ్పీఎస్‌ఎస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వశాక రజిత 600, 400మీటర్ల పరుగు పందెంలో తృతీయ, చింతల రాజేశ్వరి 600ద్వితీయ, ప్రియశ్రీ స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో ద్వితీయ, నికాడి హర్షిత్ 300మీటర్స్‌లో తృతీయ, 100మీటర్ల రిలే అల్వియా మహ్విన్, చింతల మహేశ్వరి, రజిత తృతీయ స్థానం, సహృదయ, నేహస్విత, మనస్విత, అనూష ప్రథమ స్థానం, నికాడి రాహుల్, రాజశేఖర్, కొండ అనిల్, ఎండీ నదీం తృతీయ, శివశంకర్‌ప్రసాద్, యశ్వంత్, అనిల్‌కుమార్ తృతీయ స్థానాల్లో నిలిచారు.

అథ్లెటిక్స్‌లో...
మంచిర్యాలటౌన్: గత నెల 31వ తేదీన నస్పూర్‌లోని సాధన స్కూల్‌లో జరిగిన డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ అథ్లెటిక్ మీట్‌లో మంచిర్యాల కార్మెల్ స్కూల్ విద్యార్థులు 38పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ రీన్సీ తెలిపారు. 21గోల్డ్, 9సిల్వర్, 8బ్రాంజ్ మొత్తం 38 పతకాలను సాధించిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ టిస్సీ, లిల్లీ, పీఈటీ ఫ్రాన్సిస్, చిరంజీవి, శ్రీలత, కోచ్ అనిల్ అభినందించారు.

తోపుడు బండ్లు పంపిణీ
మంచిర్యాలటౌన్: రోటరీక్లబ్ మంచిర్యాల వారి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిరుపేదలైన చిరు వ్యాపారులకు ఉచితంగా తోపుడు బళ్లను, చార్జింగ్ లైట్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్.వి. హనుమంత రెడ్డి జిల్లా కేంద్రంలో పర్యటన సందర్భంగా మంచిర్యాల, మొయినాబాద్ రోటరీ క్లబ్‌ల ద్వారా 10మందికి రూ.1.50లక్షల విలువ గల ఉచితంగా తోపుడు బళ్లతో పాటు, చార్జింగ్ లైట్లను అందించినట్లు తెలిపారు.

శివ్వారం మొసళ్ల సంరక్షణా కేంద్రం సందర్శన
భీమారం: జైపూర్ మండలం శివ్వారం గ్రామ సమీపంలో గల మొసళ్ల సంరక్షణ కేంద్రాన్ని వనదర్శిని కార్యక్రమంలో భాగంగా చెన్నూ ర్ పట్టణానికి చెందిన కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులు సందర్శించారు. మొసళ్ల చరిత్ర వివరాలను అధికారులు వివరించారు. ఏడాది పొడవునా నీళ్లు ఉండటంతో ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయని తెలిపారు.

బదిలీపై వెళ్తున్న టీచర్లకు సన్మానం

భీమారం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఆరుగురు ఉపాధ్యాయులకు శుక్రవారం హెడ్మాస్టర్ విక్రమ్‌తోపాటు సిబ్బంది కలిసి శాలువాలు కప్పి సన్మానించారు. బదిలీ అయిన వారిలో శ్రీమూర్తి, శ్రీనివాస్‌రావు, రవీందర్, సృజన, వెంకటస్వామి, శ్రీనివాస్‌లు ఉన్నారు.

విరాళం

జన్నారం: మండలంలోని రేండ్లగూడలో నిర్మిస్తున్న శ్రీ సీతా రాముల ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన అల్లం నరేశ్ రూ.60వేలు విరాళంగా అందజేశారు. దాతలు ముందు కొచ్చి ఆలయ నిర్మాణం పూర్తయ్యేలా సహకరించాలని కోరారు.